# చేదుపాట

మరో పది నిమిషాల్లో అయిదు గంటలు అవుతుందనగా చివరి ఫైలుకు 'కార్యాలయ నివేదిక' రాసేసి సూపర్నెంటుకు పంపేందుకు సిద్ధం చేశాను.

"సార్! మీకు ఉత్తరమొచ్చింది. పొద్దున్నుంచీ మీకి ఇయ్యల్లని జేబులోనే పెట్టుకోనుండాను.. సారీ సార్!" అన్నాడు అటెండరు కృష్ణప్ప. కవర్ని నా టేబులు మీద ఉంచుతూ.

"సారీ ఎందుకప్పా! ఇప్పటికయినా ఇచ్చినావు అదే పదివేలు. థ్యాంక్స్!" అన్నాను నవ్వుతూ. చివరి ఫైలును కృష్ణప్పకి ఇచ్చాను. సూపర్నెంటు టేబులు మీద పెట్టమన్నట్టు సైగ చేస్తూ.

కవర్ని చించి చూశాను. చక్కటి దస్తూరితో ఉన్న ఉత్తరం. ఆ దస్తూరితో ఉన్న వాళ్లెవరూ నాకు పరిచయం లేదు. చివర్లో చూశాను. 'గోవిందు' అని ఉంది. అసలు ఆ పేరుగల వాళ్లు ఎవరయి ఉంటారా అని ఆలోచిస్తూనే చదవనారంభించాను.

"ప్రియమైన కరుణకుమార్‌గారికి

నమస్కారములు...

హోసపేట నుండి గోవిందు వ్రాయు జవాబు" అన్న విషయం చదివాక 'గోవిందు' ఎవరో గుర్తుకు వచ్చింది.

అప్పుడు తక్కిన ఉత్తరాన్ని ఆసక్తిగా చదవడం మొదలుపెట్టాను.

"దేవుని దయ వలన మేము క్షేమముగా యున్నాము. మీరునూ ఇదేలాగున యుందురని నమ్ముచున్నాను.

ముఖ్యముగా వ్రాయు జాబు ఏమనగా వచ్చే నెల అనగా జనవరి 8వ తేదీన నేను కుటుంబ సమేతముగా తిరుపతికి పోవలయునని నిశ్చయించుకొని యున్నాను. అయితే 7వ తేదీ సాయంత్రానికి అనంతపురానికి చేరుకొని అక్కడ మీతో ఒక రాత్రి గడపవలయునని అనుకున్నాను. తర్వాతి రోజు ఉదయమే తిరుపతికి వెళ్ళిపోయెదము.

నాకు ఎంతకాలముగానో ఉన్న కోరిక, మీతో తీరికగా మాట్లాడాలన్నదే. ఒక రచయితతో ఒక రోజంతా ఉండడము సాధ్యము కాకున్నా, ఒక రాత్రి అయినా గడపడము నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తూ యున్నది. మీ రచనలు చూడడమూ, మీ అనుభవాలు వినడమూ నా వంటి సామాన్యులకు నిజంగా గొప్ప అదృష్టాలే మరి. మా మరదలికీ, పిల్లలకీ ఈ విషయం తెలియజేయండి. మా పిల్లలు ఎప్పుడెప్పుడు మీ ఇంటికి రావాలా అని ఒకటే ఉబలాట పడి పోతున్నారు. మా మరదలికి నమస్కారాలు, పిల్లలకి నా ఆశీస్సులు తెలపండి."

ఇట్లు

భవదీయుడు

గోవిందు

ఉత్తరమంతా చదివాక ఇంటికి బయల్దేరాను.

గోవిందు పూర్తి పేరు సంగనకంటి గోవిందప్ప. ఆయనది ఇంచుమించూ నా వయసే. ఎవరయినా ఆ ఉత్తరం చదివితే చాలా సామాన్యమైన వ్యక్తి అనుకునే ప్రమాదం ఉంది. అయితే అది నిజం కాదు. అతను కర్నాటక రాష్ట్రంలో ఎక్సైజు శాఖలో చాలా ఉన్నతస్థాయి అధికార హోదా గల వ్యక్తి. అతని కింద ఇన్‌స్పెక్టరు హోదా కలవాళ్ళు చాలామందే ఉంటారు. అతను కాలు కదిపితే సైన్యంతో దండయాత్రకి బయల్దేరిన రాజులా ఉంటాడు. నాకు చిత్రంగా అనిపించే విషయం ఏమిటంటే – నేను కలెక్టరాఫీసులో మామూలు గుమస్తాని అయినా, ఆయన నన్ను చూడ్డం, నాతో మాట్లాడడం గొప్పగా అనుకుంటూ ఉండటం! అందుకు కారణం నేనొక రచయిత నవడమే!

గోవిందప్ప నాకు పరిచయం అయింది కొద్దికాలం కిందటే –

ఒక మూణ్ణెళ్ల క్రితం మా చిన్నాయన కొడుకు పెళ్లి బళ్లారిలో జరిగింది. తప్పనిసరయి ఇంటిల్లిపాదీ పెళ్లికి ముందురోజే వెళ్లాల్సి వచ్చింది. పెళ్లికొడుకు ఆ సాయంత్రమే గోవిందప్పని నాకు పరిచయం చేశాడు. అతను పెళ్ళికూతురికి మేనమామ. అసలే కొత్త వాళ్లతో ఏం మాట్లాడాలో నాకయితే ఎప్పటికీ తోచదు. అందుకే గమ్మున షామియానా క్రింద ఓ కుర్చీలో కూచుని సిగరెట్టు తాగుతూ ఉండిపోయాను. అతను నాకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూచుని ఉన్నాడు.

"మీ గురించి ఇన్నాళ్ళూ విన్నాను. ఇప్పుడు మిమ్మల్ని చూస్తూ వున్నాను" అన్నాడు గోవిందప్ప నవ్వు మొహంతో. దేవుడు కనిపిస్తే ఎంత ఆరాధనతో భక్తుడు చూస్తాడో అట్లా ఉంది ఆయన తీరు.

"అట్లనా" అన్నాను. మరేమనాలో తెలీక.

"మొన్న పేపర్లో మీ కథల గురించీ, మీ గురించీ రాసినారు కదా! పెండ్లి కొడుకు చూపించె. అంతవరకూ నేను ఊహించలేదు. అన్నా! మీరు రచయితగా అంత గొప్పవాళ్ళని. నిజంగా చానా

సంతోషపడితిని.. మన వాళ్ళలో ఇంతపేరు మోసిన వాళ్ళు ఉండారంటే నమ్మబుద్ధి కాలేదు" అన్నాడు.

"మీరు తెలుగు పేపరు చదువుతారా?" అన్నాను. విషయాన్ని దారి మళ్ళించాలన్న ప్రయత్నం ఒకటయితే, మరొకటి కర్నాటకలో ఉన్న తెలుగువాళ్ళకి తెలుగు చదవడం, రాయడం రాదని నా నిశ్చితాభిప్రాయం.

"అదేంది అట్లంటారు. ఈ బళ్ళారిలో మొదలంతా తెలుగు స్కూళ్ళే గదా ఉండింది. ఇప్పుడంటే గవర్నమెంటు పట్టుబట్టి కన్నడ స్కూళ్ళుగా మార్చేసింది. నేను చదివింది మొత్తం తెలుగే!" అన్నాడతను.

"అట్లనేమీ సో.. మీరు తెలుగులో చదువుకున్నారా!" అడిగాను, అవునని తలతో సమాధానమిచ్చి-

"మీ గురించి ఇంకా విన్నాను అన్నా! మీరు రెవిన్యూ డిపార్టుమెంటులో కదా పనిచేస్తా ఉండేది" అన్నాడు.

"అవునన్నా!" అన్నాను అతను ఏం విన్నాడోనని అనుమానంగా చూస్తూ.

"అట్ల దుడ్ల డిపార్టుమెంటులో ఉండీ, ఏ పనికీ దుడ్లు ముట్టుకోరంట కదా!" అన్నాడతను నా కళ్ళల్లోకి చూస్తూ.

"నాకూ, నా స్వభావానికీ పై ఆదాయం పడదని తీసుకోనన్నా!"

"అదే మరి మీ గొప్పదనం!"

"నేను గొప్పదనమని అనుకోను. మా తెలుగుకవి 'పఠాభి' అంటాడు - 'అవినీతిగా బతకాలంటే అతి సాహసం కావాలి. నీతిగా బతికేందుకు పిరికితనం చాలని.. నేను పిరికివాడిని' అన్నాను. మరో సిగరెట్టు వెలిగించుకుంటూ.

ఆ మాటకి ఆయన గలగలా నవ్వేస్తూ - "అబ్బ! మీ కవులతో మాట్లాడేది కష్టమన్నా! మీ నిజాయితీని ఒప్పుకొనే దానికి కూడా ఇష్టపడరు.. అదే మరి మీలో గొప్ప!"

ఇంకా ఏదో మాట్లాడబోతున్నట్టే ఎవరో ఆయన్ని రమ్మనమన్నారని చెప్పారు. దాంతో చాలా వినయంగా నాతో సెలవు తీసుకుని పోతూ - "అన్నా! రేపు మధ్యాహ్నం కౌల్ బజారులో మా కొత్త ఇంట్లోకి "గృహప్రవేశం" చేస్తుండాము. మీరు కుటుంబంతో పాటు తప్పకుండా రావల్ల" అంటూ నా చేతిని ఆప్యాయంగా నొక్కి మరీ వెళ్ళాడు గోవిందప్ప.

ఆ మరుసటిరోజు ఉదయం ఆరింటికే తలంబ్రాలు అయిపోయినాయి. మామూలుగా అయితే పదింటికల్లా భోజనాలు చేసుకుని అనంతపురం దారి పట్టేవాళ్ళం. అయితే గోవిందప్ప గారి 'గృహప్రవేశం' ఉంది కాబట్టి మధ్యాహ్నానికల్లా వాళ్ళ కొత్త ఇంటికి చేరుకున్నాం.

ఇల్లు అంటే అది అట్లాంటి ఇట్లాంటి ఇల్లు కాదు. మామూలు మధ్యతరగతి మనిషి ఏ సినిమాలోనో,

టీవీలోనో తప్ప ఎక్కడా చూడలేదు. పెద్ద కాంపౌండులో కట్టిన అతి చక్కటి భవనం అని నగిషీలే చెబుతాయి. అద్దాల కిటికీలూ, రంగురంగుల గోడలూ, ఇంక డ్రాయింగ్ రూం, వంటగది, పడక గది, భోజనాల గది ఇలా చెబుతూ పోతే టాయిలెట్ రూంతో సహా అన్నీ అత్యంత ఆధునికంగా ఉన్నాయి.

పెళ్ళికి వచ్చిన వాళ్ళందరూ అక్కడే ఉండడంతో అంతా కోలాహలంగా వుంది. గృహప్రవేశ కార్యక్రమం అయిపోయింది. భోజనం అయిందనిపించుకుని వరండాలో సిగరెటట్ తాగుతూ ఉన్నాను.

"ఏమండీ! గోవిందప్ప బావ పిలుస్తున్నారు రండి" అంది మా ఆవిడ.

ఆవిడతో పాటూ ఇంట్లోకి వెళ్ళాను. బయటి హాలులో చాపమీద గోడకానుకుని తెల్లటి అడ్డపంచె బనియను వేసుకుని నింపాదిగా కూచుని ఉన్నాడు గోవిందప్ప.

"రా అన్నా! కూచో!" అంటూ తన పక్కనే చోటు చూపిస్తే వెళ్ళి కూచున్నాను.

"మీది మంచి టేస్టన్నా ! చానా అందంగా కట్టించినారు" అంటూ మెచ్చుకున్నాను.

"థ్యాంక్స్ ఫర్‌ది కాంప్లిమెంట్! ఈ మాత్రం ఇల్లు కట్టుకోవడం పెద్ద విషయం కాదని నా ఉద్దేశ్యం!" అంటూ నిర్లిప్తంగా నా వైపు చూశాడు గోవిందప్ప.

"అదేం కాదు, నాలాంటివాళ్ళు పది జన్మల తర్వాతనైనా ఇట్లా ఇల్లు కట్టుకోగలరాన్నా!"

"కావచ్చునేమో, అయితే మీ నీతి నిజాయితీల ముందు, రచయితగా మీకు వచ్చిన కీర్తి ముందు ఇవన్నీ పనికిమాలిన చెత్తే కదన్నా! ఇంకొక నూరు జన్మలు ఎత్తినా మీ మాదిరి మంచి పేరు గడించగలమా!" అంటూ అతను నా కళ్ళలోకి చూస్తూ అంటూ ఉంటే, అతని ప్రశంస నా గుండె లోతుల్లోకి తాకింది. మా ఆవిడ తలుపు ఆనుకుని నిలబడి నావైపు చూస్తూ కళ్ళతోనే గర్వంగా నవ్వుతోంది.

ఇల్లు లేకుంటేనేం, వాకిలి లేకుంటేనేం జీవితంలో మంచి పేరు ఉంటే చాలదా! అనిపించిందా క్షణంలో.

"మీకు ఇంతకు మునుపే చెప్పాను - పఠాభి గారి కవితని" అన్నాను నవ్వుతూ.

"కథకులతో మాట్లాడేది కష్టమేనన్నా! మా మరదలు ఎట్లా నెగ్గుకొస్తా వుందో మీతో" అన్నాడతను నన్ను ఓరకంట చూస్తూ. దాంతో అందరం నవ్వేశాము.

ఆ తర్వాతి రోజు ఉదయమే అనంతపురం వచ్చేశాం.

నన్ను అంతగా అభిమానించే గోవిందప్ప ఇక్కడికి వస్తున్నందుకు నాకు ఎంతో ఆనందంగా వుంది. ఇంటికి వెళుతూనే మా ఆవిడతో గోవిందప్ప కుటుంబంతో సహా రాబోతున్నాడన్న విషయం చెప్పేశాను. మొదట ఆవిడ సంతోషపడింది. ఆ తర్వాత అదోలా మొహం పెట్టి 'వాళ్ళు రాకుంటే

బాగుటుందేమో!' అంది.

'ఏం?' అడిగాను. నాకు ఆమె ధోరణి అంతుపట్టడం లేదు.

"మీరంటే ఆయనకు చానా అభిమానం కదా! తీరా ఇక్కడికొచ్చి మన ఇంటిని చూశాక - మన గురించి తేలిగ్గా అనుకుంటాడేమో."

"ఛ! అదే ముండదులేవే! ఊరికే ఏదేదో ఆలోచిస్తున్నావ్ అతని స్థాయిలో మనల్నెపుడూ చూడడులే!"

ఈ ఆడవాళ్ళకి ఎక్కడలేని భయాలు! ఏమిటేమిటో అనవసరంగా ఊహించుకుంటుంటారు.

"ఆయన అట్లా చూడడు సరే.. ఆయన భార్యా పిల్లలూ.. వాళ్ళయినా మనల్ని తక్కువగా అంచనా వేసుకోరూ!"

"వేసుకోనీలే అరుణా! అట్లా వేసుకునే వాళ్ళని మనమేమి చేయగలం. మనకి లేని డబ్బునీ, అంతస్తునీ ఎక్కడినించీ తేగలం" అంటూ మా ఆవిడకి జ్ఞానోదయం అయ్యేలా చేశాను.

జ్ఞానోదయం అయినట్టు తలూపి - "నిజమేలేండి! వచ్చే వాళ్ళని వద్దనలేం కదా! అయ్యేదేదో కానీ" అంటూనే నాకు కాఫీ తెచ్చేందుకు వంట గదిలోకి వెళ్ళింది అరుణ.

జనవరి ఏడో తేదీ వస్తోందనగానే ఇంటిని ఉన్నంతలో నీటుగా సర్దేశాం. ఇన్నాళ్ళూ చిందరవందరగా ఎక్కడ పడితే అక్కడ ఉండే పుస్తకాలు, ఇప్పుడు బుద్ధిమంతులయిన పిల్లల్లా పుస్తకాల అల్మారాలో నన్ను చూస్తూ నిలుచుని ఉన్నాయి.

ఏడో తేదీ రానే వచ్చింది.

ఆ వేళ సాయంత్రం ఆఫీసు నించీ ఇంటికి వచ్చేటప్పటికి గోవిందప్ప కుటుంబంతో పాటూ ఇంట్లో ఉన్నాడు.

పలకరింపులయ్యాయి.

కాఫీలు తాగుతూ బయటి గదిలో కూచుని ఉన్నాం - నేనూ, గోవిందప్ప.

"ఏమిటి విశేషాలు అన్నా! ఈ మధ్య ఏమయినా కొత్త కథలు రాసినారా?" అడిగాడతను.

చెప్పాను.

రచయితలంటే ఆయనకు చిన్నప్పటి నుంచీ ఎంత గౌరవమో చెప్పాడు. నన్ను కలుసుకున్నప్పుడు తను ఎంత థ్రిలల్ ఫీలయ్యాడో చెప్పాడు. కర్నాటక రాష్ట్రంలో రచయితల్ని ఎంతగానో గౌరవిస్తారనీ, నాలాంటి రచయితలు అక్కడ ఉండి ఉంటే ఆ కథే వేరుగా వుండేదనీ అన్నాడు.

నిత్యం ఏ వైన్ షాపుల రాబడి గురించో, దొంగసారా నేరాలు గురించో ఆలోచించాల్సిన మనిషి ఇట్లా రచనల గురించీ, రచయిత గురించీ మాట్లాడుతూ ఉంటే భలేగా అనిపించింది నాకు.

అతను అట్లా మాట్లాడుతూ ఉంటే, ఈ మధ్యనే నా ఇంటర్వ్యూ వచ్చిన పత్రికని మా ఆవిడ తీసుకువచ్చి అతనికి ఇచ్చింది.

"ఆఁహాఁ! అరెరే ఇంటర్వ్యూ బాగా పెద్దగా వచ్చిందే!" అంటూనే దాన్ని చకచక చదవడం ప్రారంభించాడు గోవిందప్ప.

ఈలోగా నేను బాత్‌రూంకెళ్ళి మొహం కడుక్కొని వచ్చాను.

"బాగుందన్నా ఇంటర్వ్యూ" అన్నాడు గోవిందప్ప.

జవాబుగా నవ్వాను.

మా పిల్లలు, వాళ్ళ పిల్లలతో స్కూలు గురించిన కబుర్లేవో చెప్పుకుంటున్నారు. మా ఆవిడ పెద్ద కంచం నిండా పకోడీలు తెచ్చి పెట్టింది వాళ్ళ ముందు. పిల్లలు వాటిపై దాడి చేశారు.

మా చేతుల్లోకి పకోడీల ప్లేట్లు వచ్చాయి.

"అన్నా! ఈ ఇల్లు మీ సొంతమేనా?" అడిగాడు గోవిందప్ప పకోడీ నములుతూ.

"కాదన్నా! బాడుగదే - నాకు ఈ భూ ప్రపంచం మీద ఎక్కడా సొంత ఇల్లు లేదు" అన్నాను నవ్వేస్తూ.

"నిజంగా! ఇట్స్ వెరీ బ్యాడ్! వెరీ బ్యాడ్!! ఇన్నేండ్ల మీ సర్వీసులో ఒక్క ఇల్లు కట్టుకోలేక పోయినారా? ఏ గవర్నమెంటు సర్వెంటుకయినా లోన్ ఇస్తారు కదా!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"లక్షలు అప్పుచేసి ఇల్లు కట్టుకోవడం.. ఆ అప్పు తీర్చలేక నానా అవస్థలూ పడడం.. అవన్నీ ఎందుకని.."

"ఎవరికి లేవు అవస్థలు? మీరొక్కరే ప్రత్యేకంగా అవస్థలు పడతారా?"

"అట్ల అడగండి బావా!" అంది మా ఆవిడ, నవ్వుతూ.

అంతే - ఆయన మొదలుపెట్టాడు.

"నాకు తెలీక అడుగుతాను. మీ నీతి నిజాయితీలు ఏం ఒరగబెట్టాయి? తల దాచుకొనే దానికి ఒక గూడు సంపాదించి పెట్టాయా? ఆ డొక్కు సైకిలు తప్పా కనీసం మోపెడ్ కూడా లేదు మీకు! ఇంట్లో చిన్న ఫ్రిజ్ లేదు. ఇక్కడ ఉండే వస్తువులన్నీ ఈ కాలానివా? అన్నీ ఇక్ష్వాకుల కాలం నాటివే! అసలు మీరు పని చేస్తున్న డిపార్ట్‌మెంటే డబ్బుకు మారుపేరయిన డిపార్టుమెంటు. మీరింకా సత్యకాలపు మనిషి మాదిరి ఉన్నారు. పేదవాళ్ళకి సహాయం చేయండి - వాళ్ళతో డబ్బు తీసుకోవద్దండి. కాని షావుకారు మీ దగ్గరికి వస్తాడు కదా వానితో డబ్బు తీసుకోండి" ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు గోవిందప్ప.

అతని మాటల్ని అడ్డుకుంటూ.

"నేను ముందే చెప్పినాను మీకు - నాకు అవినీతిగా బ్రతకడం చేతకాదని" అన్నాను.

ఆ మాట వింటూనే వీరావేశంతో రెచ్చిపోయాడు ఆయన.

"ఇట్లా మాట్లాడవద్దన్నా! మీరు ఒక్కరే ఈ లోకాన్ని ఉద్ధరించలేరు. మీ భార్యా బిడ్డలు భవిష్యత్తులో ఏం కావాలనుకున్నారు? ఇప్పటికీ మించిపోయింది లేదు. మనిషికి కనీస అవసరాలకి పై సంపాదన చేస్తే తప్పులేదు" అని అంటూ ఉండగానే -

"ఆయన రచయిత కద బావా! అవినీతి పనులు చేయలేరు" అంది అరుణ నన్ను సపోర్టు చేస్తూ.

"చూడమ్మా అరుణా! ఏం రచయితమ్మా! బతికే దానికి అడ్డమొచ్చే రచన ఎందుకమ్మా! ఒట్టు తీసి గట్టు మీద పెట్టేయమనమ్మా! రచయితగా ఏం సంపాదించినాడు? బాగా పేరు సంపాదించినాడు. అదేం కూడు పెడుతుందా, నీళ్ళిస్తుందా? దేశంలో ఈయన రాయకపోతే ఒరిగేదేం లేదు లేమ్మా! ఇంక ఈయనకి సర్వీసు ఎంత వుంటుంది మహా అంటే 12, 13 ఏళ్ళు అంతే! ఈ కొన్నేళ్ళయినా బాగా సంపాదించమనండి. ఆ తర్వాత పుస్తకాలు రాయమనండి.. అవునూ ఆ అల్మారాలో వున్నవి జ్ఞాపికలేనా" అడిగాడు గోవిందప్ప - తన ఉపన్యాసానికి కాస్త విరామమిచ్చి.

"అవునన్నాను" కాదంటే తన్నేలా ఉంది అతని వ్యవహారం.

"నా కథల సంపుటికి నూతలపాటి సాహితీ సత్కారం అది. చాసో అవార్డు ఇదీ. తెలుగు యూనివర్సిటీ అవార్డు ఇదీ..." అంటూ చూపెట్టాను.

"నాకూ గవర్నమెంటు వాళ్ళు ఆగస్టు 15న, జనవరి 26న లెక్కలేనన్ని మెడల్సూ, సర్టిఫికెట్లూ, మెమెంటోలూ ఇచ్చారు. ఇవన్నీ నాలిక గీసుకొనేదానికి కూడా పనికిరావు" అని తేల్చేశాడు. ఆయన మాటలకి నా తల దిమ్మెక్కి పోతూ వుంది.

నా నీతి నిజాయితీలను మెచ్చుకొన్న మనిషి ఇతనేనా?

నేను రచయితనని తెలిశాక పొంగిపోయిన మనిషి ఇతనేనా!

ఈ మనిషితో రేపు ఉదయం వరకూ గడపడం ఎట్లా? అనుకుంటూ ఉంటే గుండెల్లో దడ పుట్టుకొస్తోంది!

- హస్తరేఖలు, ఉగాది ప్రారంభ సంచిక ఏప్రిల్, 2002.